# ధ్వజస్తంభ ప్రతిష్ఠ

## భాగవతుల సుబ్రహ్మణ్యం

విశ్వనాధుని నివాసమైన హిమగిరి శృంగంలా, మెరిసిపోతోంది. విరూపాక్ష దేవాలయ గోపురం - వెన్నెల్లో.

నవమినాటి చంద్రవంక, సూచ్యాకార గోపురం పక్కగా, సాక్షాత్తు పరమశివుడే నెలతాల్పుని శిరసున దాల్చాడా అనే భావాన్ని కలిగిస్తోంది.

ఆలయ మంటపం చివర, అలవోకగా పడుతున్న వెన్నెల చల్లదనాన్ని తనివితీరా గ్రోలుతూ – గావంచా పరుచుకుని, తలకింద చెయ్యిపెట్టుకుని దీర్ఘాలో చనలో పడిపోయాడు చిదంబర శాస్త్రులు.

ఓ పుణ్యనదీ తీరాన వెలసిన విరూపాక్షాలయం - ఆ గ్రామానికి ప్రకృతి ప్రసాదించిన వరం. ఆలయంలో శివుడు స్వయంభువు. దేవతలు ప్రతిష్ఠించారని ప్రతీతి. రక రకాల కథలూ - గాథలూ ప్రచారంలో వున్నా, స్థలమహాత్మ్యాన్ని చాటి చెప్పే సంఘటనలు అప్పుడప్పుడూ జరుగుతూనే వున్నాయి! ఇటీవల అలాంటి సంఘటనే ఒకటి జరిగి, మిడి - మిడి జ్ఞానంతో, కుహనా సంస్కారంతో దేవుళ్ళేడని వాదించే నాస్తిక పిపీలికాదులకి కనువిప్పు కలిగిందనే చెప్పాలి. అప్పటికీ – లోపల నిజమనే భావన చోటు చేసుకున్నా, పైకి మాత్రం "అబ్బే! ఉత్త ట్రాష్" అనే వాళ్ళకి చెంపపెట్టులా కొన్ని నిదర్శనాలూ కనిపించాయ్.

ఇటీవల జరిగిన ఆ విశేషం ముచ్చటించే ముందు, కొంత కథ జరగవలసి వుంది.

నాందీ ప్రస్తావనలతో సహా కథా విషయం ఇదీ ...

చుట్టూ పచ్చని పంట చేలూ – చెట్లూ – సెలయేళ్ళూ - కొండలూ అలంకారాలుగా సహజాభరణాలుగా కలిగివున్న అందమైన గ్రామం అది.

నాగరికతా విషవాయువులు ఆ గ్రామం మీదకి ఇంకా అంత దారుణంగా ప్రసరించలేదు.

ఊరు మొత్తం మీద ఏ పదీ - ఏ పాతిక మందో, బస్తీల కెళ్ళి చదువులు వెలగబెడుతూ, శెలవులకొచ్చే టప్పుడు నగరపు నగిషీలూ – జిలుగులూ తమ గ్రామంలో కూడా స్థాపిద్దామని ప్రయత్నించినా, ఆ కొత్తని వింతగా తమ ప్రాత ప్రజలు గుర్తించక పోవడం - మోజు చూపించక పోవడంతో వారికి ఆశాభంగం కలిగిందనే చెప్పాలి.

ఊరంతా కలిపి ఐదారు వందల గడప కంటె ఎక్కువుండదు.

అన్ని జాతుల, వర్గాల మధ్య సామరస్య భావం మనసా - వాచా - కర్మణా వున్న ఆదర్శగ్రామం అన దగ్గ ఆ వూళ్ళో, వున్నవి ఇరవై వీధులే అయినా - విశాలంగానూ, అక్కడి మనుషుల మనస్సుల్లాగే నిర్మలంగానూ వుండి చూడ ముచ్చటగా వుంటాయ్.

ఊరుని అనుకుని ప్రవహిస్తున్న జీవనది, సాలు మున్నూరు కాలమూ గ్రామస్తులకు నీటి కొరత అంటే ఏమిటో, ఎలా వుంటుందో తెలీనివ్వదు.

ఎవరి వృత్తులు వారు నిశ్చింతగా నిర్వర్తిస్తూ, 'దేశ సౌభాగ్యానికి గ్రామాలే పట్టు గొమ్మలు' అన్న సూక్తిలోని సత్యానికి ప్రతీకగా నిలుస్తారు.

పాపభీతీ దైవభక్తీ గ్రామ ప్రజల అంతరాంతరాల్లో చెరగని ముద్ర వేసుకుని వుండి.

అగ్రవర్ణాల పట్ల భక్తి ప్రపత్తులూ - ఆదరణాప్యాయతలూ ఊళ్ళో వాళ్ళందరూ తమ విధిగా భావిస్తారు.

అందుకే - ఎక్కడో ఎవరికి తెలీదుగాని, చిదంబర శాస్త్రులు ఆ వూరు చేరిన నాటి నుంచి నేటి వరకూ నిశ్చింతగా, భారంలేని బ్రతుకు వెళ్ళదీయ గలుగుతున్నాడు.

అతడా వూరు చేరి పాతిక సంవత్సరాల పైనే అయింది.

అప్పటి కింకా గ్రామంలో ఇంత జనాభా లేదనే చెప్పాలి. ఏదో గిరిజన గ్రామంలా, అక్కడొకటీ-ఇక్కడొకటీ ఒకదాంతో ఒకటి పొంతన లేనట్టుగా ఇళ్ళుండేవి.

దేవాలయం మాత్రం? దీపం వెలిగించే నాధుడు లేక, పూజా పునస్కారాల్లేక, బూజులు పట్టి - పుట్టలు పెట్టి ఎంత భయం గొల్పుతూండేదని సాయంత్రం అయితే, ఆ దరిదాపులకు కూడా వెళ్ళడానికెవరూ సాహసించేవారు కారు.

చాలా కాలంగా, అదో అమ్మవారి దేవాలయం అనీ, పేరు తెలీని పాడుబడ్డ దేవుడిగుడి అనీ, అనుకుంటూనే వుండేవారు తప్ప – ప్రజానీకానికి అది పరమశివుడి గుడి అని తెలిసింది కాదు.

చిదంబర శాస్త్రులు వచ్చాకనే, ఆ దేవళంలో దేవుడు బయల్పడింది -

అప్పట్లో ...
నేటికి పాతికేళ్ళకిందట –

ఇంకా బయటి ప్రపంచంతో ఏ సంబంధమూలేని - సరైన రహదార్లు లేని కాలంలో, సన్నగా కాలిబాటల మీదుగా నడుచుకుంటూ - వేదపారాయణ చేసుకుంటూ వస్తున్నాడో నడివయస్కుడు.

విశాల వక్షాన విభూదిరేకలు, మెడలో రుద్రాక్షలు, నుదుటన తీర్చిన భస్మప్పెండెకట్లు, కావి పంచె కట్టు ... వెరశి ఆకారం అతడు వేద పండితుడని, వీర శైవుడని చెప్పకనే చెప్తాయి. మరీ అంత లావూకాని - సన్నం కాని సనుమైన తీరులో ఓ మాదిరి వడివున్న నడకతో, అతడా గ్రామం శివార్లు దగ్గరకి చేరేసరికి, ఎండధాటికి తట్టుకోలేక శోషొచ్చి పడిపోయేడు.

ఎంతసేపు గడించిందో తెలీదు కాని, మధ్యాహ్నపు సూర్యుడు పడమటి కొండలవైపు పరుగులు తీస్తున్న వేళకు - మెట్టసాగు చూసుకుని వస్తున్న రైతు వర్గం ఆయన్ని చూడ్డం జరిగింది.

"అరే! పాపం – బాపనాయన. మొహం తిరిగి పడిపోయి నట్టున్నాడు. ఎవరో తెలీదు. ఎటు పోతున్నదీ తెలీదు" అనుకుంటూనే నదిలోంచి నీళ్ళు తెచ్చి ముఖాన జల్లి తెలివి తెప్పించి నీళ్ళు తాగించి సేద దీర్చి "ఏ వూరు మన్ది పొంతులూ! ఏడికి పయిన మయ్యేరు? ఇంతెండ వేళ, ఏ చెట్టు నీడనైనా కొంత సేపు కూసోనేకపోయేరా?" అని ఆప్యాయంగా అడిగేరు.

కాస్త ఈ ప్రపంచంలో పడ్డాక, సంస్కారవంతుడు గనక తనని మళ్ళీ బతికించినంత పన్జేసిన ఆ గ్రామస్తులకు కృతజ్ఞతలు చెప్పి మళ్ళీ నడక సాగించబోయేడు. కాని అది అతడికి అసాధ్యమే అయింది.

వేదం చదూకున్న – బాగా బతికిన వూళ్ళో మెతుకు పుట్టక, పూలమ్మిన చోట కట్టెలమ్మలేక, ఘనాపాఠీల మని కాస్త జ్ఞానానికే వీరె వీగుతున్న గర్వోష్టుల మధ్య ఉండలేక ... ఇలా ఎన్నో కారణాల వల్ల స్వంత చోటు వదిలిపెట్టి, బతుకు తెరువు వెతుక్కుంటూ బయల్దేరే డతడు.

ఘనాహారం తిని ఎన్నాళ్ళయిందో ఆ పరమాత్ముడికే ఎరుక. నీరసానికి కారణం అదే!

ఆ సంగతే ఆతడు వారికి దాచకుండా చెప్పేడు.

ఊళ్ళో వున్న ఒకే ఒక బ్రాహ్మణ కొంప వరకూ ఏదోలా ఓపిక చేసుకురండని గ్రామస్తులు బ్రతిమాలారు. "లేదు ... మెతుకు పుట్టే చోట బతక డానికే పోతున్నాను" అని పడిన చోట నుంచి మళ్ళీ లేవబోయేడతడు.

"ఈ వూళ్ళో మీకు మెతుకు పుట్టిందనుకోండి ! ఇక్కడే ఉండి పోడానికి మీకేమన్నా అభ్యంతరమా ?" అని అడిగారు వాళ్ళు.

"అదేం లేదు ! ఉత్తపుణ్యానికి మీ గ్రామస్తుల రెక్కల కష్టంమ్మీద ఆధారపడ్డం - ఊరకే కూర్చుని తినడం నా వల్ల కాని పని. మీ గ్రామానికి నేన్చేసే ఉపకార మేదన్నా వుంటే చెప్పండి. అయినా నా వల్ల మీక్కలిగే మేలు ఏం వుంటుంది గనక ? రెక్కల కష్టం చెయ్యగల సత్తువ భగవంతుడిచ్చినా, ఏ వృత్తిలోనూ మెలకువలు తెలీని బ్రాహ్మడినయిపోయేను. వేదమ్ముక్కలూ - ఆశీర్వచన మంత్రాలూ - పూజా పురస్కారాలు తప్ప ఇంకేం రాని, నేను మీకేం చేయగలను ?" అని వాపోయేడాయన ...

అక్కడికి దగ్గర్లోనే వున్న ఆలయం వైపు చూపిస్తూ "అటు చూడండి బాబూ ! ఏ దేవుడు వెలిసేడో, ఎన్నాళ్ళయి పాడుబడిందో ? ధూపదీప నైవేద్యాలు లేకుండా ఎలా మరుగున పడిపోయేడో మాకు తెలీదు కాని, తలా ఓ చెయ్యివేసి, ఆ ప్రాంతం అంతా శుభ్రం చేస్తాం ... దేవుడ్ని కనుగొని, ఆ దేవుడ్నే కనిపెట్టుకుని వుండండి బాబూ ! మా వూరి గుళ్ళోదీపం పెట్టండి" అని సమస్యకి వెంటనే పరిష్కారం సూచించేశాడో రైతు పెద్ద.


అది చిదంబరశాస్త్రికి నచ్చింది.

అన్నమాట ప్రకారంగానే, రెండో నాటికల్లా గ్రామస్తులు పలుగూ - పారలతో, దేవళం దగ్గర మొక్కా - మోడూ పెరికి పారేసి శుభ్రం చేశారు. చదునైన జాగా మీద పుట్టి తొలగించే సరికి, విశాలమైన మటంపం లాంటి కట్టడం నందితో కూడా కన్పించింది.

వెంటనే గుడిలో శివుడున్నాడని గ్రహించేశారందరూ ...

అంటే కొన్ని శతాబ్దాల కిందట, ఏ మహారాజుల కాలంలోనో, తమ వూరిగుడి, గుళ్ళోని దేవుడూ వైభవాన్ని - నిత్య భోగాల్ని చవి చూడడం జరిగిందన్న మాట !

అలాగే,మట్టి - పుట్టలూ తవ్వుతూ, గర్భగుడిలోదాకా దారి చేసుకుంటూ పోయేసరికి, అన్ని అమరికలూ వుండి కొద్దిపాటి శిథిలావస్థకి గురైన శివలింగం బయల్పడడం, ఒకప్పుడు ఆలయంలో అర్చకులు వాడిన దైవ పరమైన సామగ్రి కనిపించటం జరిగే సరికి, గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేక పోయేయి.



రెట్టించిన ఉత్సాహంతో, మరో వారం రోజుల్లో శిఖరంపై అంచు వరకూ పాకిన అడవి దొంకల్లూ, తీగలూ, చుట్టూ గోడల్ని కప్పేసిన సీమ చింత – తుమ్మ మొక్కల కొమ్మలూ నరికి పారేసి, వెల్ల వేయించి, ఆలయానికి కళ తెప్పించారు.

ఆ విధంగా దేవుడి గుడి బాగుపడ్డాకనే, ఊరు బాగుపడింది.

అక్కడక్కడా వున్న ఇళ్ళు క్రమంగా ఎక్కువై, వీధులుగా రూపాంతరం చెంది, గ్రామం అనిపించుకోడానికి అన్ని అర్హతలూ సంపాదించుకుంది.

ఊరు పెరిగిన కొద్దీ, దేవుడికి నిత్యపూజలూ – నీరాజనాలూ ఎక్కువయ్యాయి.

ఆలయం ఆవరణలోనే శాస్త్రులవారు ఉండటానికి కుటీరాన్ని పోలిన తాటాకు పాకను నిర్మించి ఇచ్చారు గ్రామస్తులు. పండగలు – పబ్బాలు లేని కాలంలో కూడా, దేవుడి నిత్య కొలుపుకి ఆర్థిక పరమైన చిక్కులు ఎదురు కాకుండా వుండేందుకుగానూ, శాస్త్రులవారి అన్నవస్త్రాలకు లోటు లేకుండా ఉండడం కోసమూ 'దేవుడిమాన్యం' పేర కొంత భూమిని ఆలయానికి రాసేశారు దాంతో ఆయన జీవికకిక నిశ్చింత ......

శాస్త్రుల వారికి పిల్లా – జెల్లా ఉండే వారని మొదట్లో చాలాకాలం వరకూ అందరూ అనుకొనే వారు. అయితే ఒకానొక మాట పట్టింపు మీద చిదంబర శాస్త్రి అసలు పెళ్ళే చేసుకోలేదని, శాశ్వత బ్రహ్మచర్య దీక్ష పట్టాడని తెలిసి ఊరివాళ్ళంతా ఆశ్చర్య పోవడమే కాక, ఆయన నిగ్రహ శక్తిని వేనోళ్ళ పొగిడారు.

'సంపాదించాలీ – ఒకరికి పెట్టాలీ – రేపటికి దాచుకోవాలీ' అనే సంసార ఝంఝాటం లేని శాస్త్రుల వారి మాట మీద ... డబ్బు కాపీనం ఏ మాత్రం లేని శాస్త్రుల వారి మాట మీద ... నిరంతరం గ్రామం మేలుకోరే ఆయన ఆశీస్సులు మీద, ... ఊళ్లో పిన్నలకీ – పెద్దలకీ ఆయన మీద గురీ – గౌరవం నానాటికీ రెట్టింపు కాసాగింది.

ఊరి సదుపాయాలతో పాటు, ఆలయానికి కావలసిన సదుపాయాలూ ఏమేమి కావాలో చిదంబరంగారిని అడగనిదే, ఆయన సలహాలేనిదే, గ్రామ పెద్దలెవరూ స్వంత నిర్ణయాలు తీసుకొనే వారు కాదు.

కేవలం నిర్ణయాలేనా ? మంచీ – చెడూ ప్రస్తావనల్లో సైతం – ఆయనదే అగ్రతాంబూలం. శాస్త్రులవారు చెప్పిందే తుది తీర్పు. దానికి కట్టుబడి వుండటం తమ విధి.

కాలం ఇలా సాఫీగా జరిగిపోతూ వుండగా ...

ఆ వూరు తప్ప, చుట్టు ప్రక్కల ఊళ్లన్నిటిలోనూ విశేషమైన మార్పులొచ్చేశాయి. సర్కారు సంస్కరణల పేరిట ఊరికో బ్లాక్ డెవలప్మెంటు ఆఫీసూ, పంచాయితీ ఆఫీసూ, పి.డబ్ల్యు.డి వంటి కొన్ని ప్రభుత్వాఫీసులూ ఓ మాదిరి పెద్ద గ్రామాలలో వెలిశాయి. ఆ వూళ్లో కూడా గవర్నమెంటు తన వేళ్లూను కుంది. జనాభా రికార్డులు తయారయ్యేయి.

ఎలక్షన్లంటూ నాయకులూ బయల్దేరేరు.

కొంత కాలానికి తమ గ్రామం కూడా ప్రభుత్వ కాలుష్యంతో నిండిపోతుందని, ప్రశాంతంగా వున్న వూరు నానా రాజకీయాలతో, కక్షలతో, కుతంత్రాలతో చీలిపోయి భ్రష్టు పట్టిపోతుందనీ, దీనికి తరుణోపాయం ఏమిటనీ గ్రామ పెద్దలు చిదంబర శాస్త్రులతో ఆలోచించేరు.

పరిస్థితులను కూలంకషంగా అవగాహన చేసుకున్న వాడై, చిదంబర శాస్త్రులు "తప్పదు ! ఈ మార్పుని ఎవరం ఆపలేం ! ప్రభుత్వం అనేది మారుమూల గ్రామాల్లో సైతం విస్తరిస్తుంది. ప్రతి గ్రామం అండా దానికి కావాలి. మనం ప్రభుత్వాన్ని బహిష్కరించనూ లేము – వ్యతిరేకించనూ లేము. రానివ్వండి! ఇన్నాళ్లూ ఎవరి వృత్తులు వారు చేసుకుంటున్నారు. తర తరాలుగా – వంశపారంపర్యంగా అదే వృత్తి వాళ్ళకి జీవనాధారం అవుతోంది. నిశ్చింతగా బతుకుతున్నారు. కాని రేపు – ప్రభుత్వ పాఠశాలలొస్తాయి. నిర్బంధ విద్య వస్తుంది. పిల్లలకి విధిగా చదువు చెప్పించాలి. విద్య కొంత వివేక హేతువే అయినా, వృత్తిమీద ఆసక్తిని సన్నగిల జేస్తుంది. ఉద్యోగాలంటూ – బస్సీల చుట్టూ తిరిగే దౌర్భాగ్యపు రోజులు దాపురిస్తాయి. అంతే ! మన తరం మాత్రం ఇలాగే తెల్లారిపోతుంది. మనలో మార్పేం వుండదు. కాని రేపటి తరమే – ఈ మార్పుని ఆహ్వానిస్తుంది. అది అవసరం కూడా ! దాన్ని కాదని మనుగడ సాగించడం కూడా కష్టమయి పోతుంది." అని భవిష్యద్దర్శనాన్ని సెలవిచ్చారు.

అదే జరిగింది.

అంతకు ముందు, మందకొడిగా ఎప్పుడో ఒకటీ – అరా మార్పులు సంభవించే ఆ వూళ్లో అచిరకాలంలోనే – నేరాలున్నా లేకపోయినా ఓ పోలీస్టేషనూ, పిల్లలొచ్చినా – రాకపోయినా ఓ ఎలిమెంటరీ స్కూలూ, రేపు గురించి ఎవరికీ ఏమాత్రం చింత లేకపోయినా ఓ ప్రభుత్వ బాంకు శాఖా ... ఇంకా, ఓ మాదిరి గ్రామానికి ఏమేం రావాలో అన్నీ వచ్చేశాయి. ఇతర ప్రదేశాల నుంచి గవర్నమెంటుద్యోగాల మీద, కొత్త వ్యక్తులు గ్రామంలో ప్రవేశించేవారు.

మరీ ఎక్కువగా కాక పోయినా, కొద్దో – గొప్పో ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి వాళ్ళు కారకులయ్యేరు.

వ్యక్తి ఆరాధనని వ్యతిరేకించడంలో, వాళ్ళు ప్రేరణ ఇవ్వడం ప్రారంభించేరు.

సజావుగా సాగిపోతున్న గ్రామ జీవితంలో, బేజారు సృష్టించారు.

తత్ఫలితంగా ఆ ఊరి ప్రజల్లో పరస్పర సహకార బుద్ధి స్థానే, స్వార్థం బీజాలు నాటుకున్నాయ్.

దాతృత్వ గుణం పోయి, దోపిడీ తత్వం మొగ్గ తొడిగింది.

శాంతియుత జీవన ధారకి అంతరాయం ఏర్పడి, అభద్రతా భావన చోటు చేసుకుంది.

మౌనంగానే, మారుతున్న కాలాన్ని భరిస్తూ వస్తున్నాడు చిదంబర శాస్త్రి.

ప్రజల్లో దైవభక్తి పూర్వం వున్నంత ముమ్మరంగా లేకపోయినా, ప్రత్యేక పర్వదినాల్లో కొద్దో – గొప్పో ప్రకటిత మవుతూనే వుంది.

అలాంటి పరిస్థితుల్లో ...

'రేపు' గురించి 'దాపు' తప్పనిసరైంది.

తొలిసారిగా ఆ అవసరం కన్పించింది. కాని అది అతనికి చాతకాలేదు.

కొన్ని గడ్డు నెలల్లో, ఆలయానికి ఎవరూ అర్చనకు రాకపోతే, దేవుడితో పాటు తానూ పస్తు పడుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

దాని క్కారణం —— దేవుడి మాన్యాన్ని సాగుచేస్తున్న రైతుల్లో స్వార్థ బుద్ధి ప్రబలిపోవడమే! ఏవో కుంటిసాకులు చెప్పి, పంట సరిగా చేతికివ్వక ఎగవేసేస్తూ వుంచే చిదంబర శాస్త్రులు ఏం చేస్తాడు ?

ఓ మాదిరి నిర్లిప్తతతో, మనోవ్యాకులతతో శేషజీవితాన్ని వెళ్ళదీయడానికే నిశ్చయించుకున్నాడు.

అలాంటి గడ్డు రోజుల్లోనే, గోదావరీ తీరం నుంచి వీరభద్రాచారి వచ్చి, చిదంబర శాస్త్రుల్ని ఆశ్రయించాడు.

"స్వామీ ! తమరి చల్లని చెయ్యి అని విన్నాను. మీ చేత్తోనే నాకీ వూళ్లో ఇంత ఉపాధి కల్పించండి" అని వేడుకున్నాడు.

అప్పటికే పరిస్థితులా – పెత్తనాలు శాస్త్రులవారి చేతులు దాటిపోయేయి.

విని, ఊం కొట్టే వాళ్లే తప్ప, విలువనిచ్చి గతంలో లాగ వెంటనే ఆచరించే పెద్ద మనుషులు రాజకీయాల్లోకి జారుకున్నారు.

అదే విషయం చెప్పాడు శాస్త్రులు.

"పోనీయండి ! నా కొచ్చిన ఏకైక వృత్తికే ఒక ఆసరా కల్పించండి. మనదేశంలో, ముఖ్యంగా దక్షిణాదిన ధ్వజస్తంభం లేని శివాలయాలు ఎక్కడోగాని, అసలు సాధారణంగా కన్పించవు. శిథిలాలయం పునరుద్ధరణ జరిగినా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మాత్రం జరగలేదు కదా ! తామ్రపత్రాలూ – ఇత్తడి రేకులూ మేళవించి, నగిషీలు దిద్ది అద్భుత పనితనం కన్పరుస్తూ, శిఖరాన చిరుమువ్వల గంటలు అమర్చి, నిర్దిష్టమైన ఎత్తులో స్తంభాన్ని తయారిస్తాను. మీ కున్న ఏ మాత్రం కొద్దిపాటి పలుకుబడి అయినా, వినియోగించి నాకీ సాయం చేయండి" అని ప్రాధేయ పడ్డాడు.

పరోపకార బుద్ధి జన్మతః వచ్చిన చిదంబర శాస్త్రికి యోచన బాగానే వున్నట్టనిపించింది.

తానంటే, ఇంకా అంతో - ఇంతో అభిమానం కనపరిచే ఐదారుగురు వాణిజ్య ప్రముఖుల్ని సమావేశ పరిచి, ఇటీవలి కాలంలో ఆలయానికి సంస్కరణ రూపేణా ఏమీ చేయడం లేదన్న విషయాన్ని పదే-పదే నొక్కి చెప్పి "ఇన్నేళ్ళయినా గుడికి కనీసం ధ్వజస్తంభం లేదన్న" సంగతిని ప్రముఖంగా కనపరచి "ఈ వేసవుల్లో అది కాస్తా పూర్తి చేస్తే గ్రామం సుభిక్షంగా వుంటుందనీ, వర్తక వ్యాపారాలు సజావుగా సాగిపోతాయనీ" సూచించాడు శాస్త్రులు.

మారిన పరిస్థితుల ప్రభావము వారి మీద కొంత పడినా, దైవకార్యం తప్ప స్వకార్యం కాదనే సంగతి గ్రహించుకోవడం చేత "సరే! ఏర్పాట్లు చేయించండి! మరి మనకి అంత ఎత్తున స్థంభ నిర్మాణం చేయగల లోహశిల్పి దొరకాలి గదా!" అన్నారు.

వెంటనే వీరభద్రాచారిని పరిచయం చేసి "గోదావరీ తీరాన వున్న ఓ పుణ్యక్షేత్రంలో, ఈ శాస్త్రాధ్యయనం చేసిన నిష్ణాతుడైన వ్యక్తి ఇతడు. అందుకు అన్ని విధాలా సమర్థుడు -" అని తెలియజేశాడాయన.

మరో రెండు మూడు సమావేశాలు జరిగాయి.

ప్రముఖ వ్యక్తులతో పాటు, గ్రామస్థుల దగ్గర కూడా యథాశక్తి చందాలు పోగుచేశారు.

ఆలయం ఆవరణలోనే, మరో తాటాకు పాక నిర్మించి, చార్యులకు ఇచ్చారు.

తగినంత సమయం తీసుకుని, ఏకాగ్రతతో స్థంభాన్ని చెక్కడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు.

శాస్త్రులవారు అందించిన చేయూతకి చార్యులు ఎంతో పొంగిపోయాడు.

ఏక దీక్షతో ధ్వజస్థంభ నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు.

అవసరమైన లోహాలు తెప్పించడం చేత, పని, ఆటంకం లేకుండా సాగిపోతోంది. కాని చార్యులకు భోజన వసతి ఎలా? ఉన్నంతలో శాస్త్రులే ఆ ఏర్పాటు కూడా చేశాడు.

కండలు తిరిగిన ఉక్కు కడ్డీ లాంటి శరీరం చార్యులది.

లోహాన్ని కాల్చి, రేకులుగా సాగగొట్టి - అవసరమైతే, అనుకున్న విధంగా సాగకపోతే, మళ్ళీ - మళ్ళీ ప్రయత్నించి, సరిచేస్తుంటే, అతడి కార్య దీక్షకి అబ్బుర పడనివారు లేరు.

ముడిలోహం కొలిమిలో కరిగి, ముద్దగా మారి, పల్చని రేకులుగా సాగి, చిన్న - చిన్న స్థూపాల ఆకారం దాలుస్తోంది. లోపల బోలుగా వుండే గొట్టం మాదిరి స్థూపాలు మూడేసి రోజుల కొకటి తయారవుతున్నాయ్. రెండింటిని అతికే చోట, మరికొంత ఎక్కువ కైవారంతో కలిపే రింగులు చేయడానికి. స్థంభపు శిఖరాన వుండే కేతనం, దానికి గంటలూ చేయడానికి ఎక్కువ సమయం పడుతోంది. అలాగే ధ్వజస్థంభం అగ్రానికి చేరుకొనే కొద్దీ, స్థూపపు గొట్టాల ఆకృతి చిన్నది అవుతూవుంటుంది. అవి మరింత జాగ్రత్తగా రూపొందించాలి. మొత్తానికి సక్రమమైన కొలతలతోనే సత్కార్య నిర్వహణ రెండు నెలల్లో పూర్తి అయింది.

పౌష్య మాసంలో పున్నమికి ప్రారంభించిన పని, ఉగాది వెళ్ళిన నెల్లాళ్ళకి - వైశాఖ ప్రవేశం నాటికి అన్ని హంగులతోనూ ధ్వజసహితంగా అమరింది.

ఇక ప్రతిష్ఠించడానికి దివ్యమైన ముహూర్తం కోసం అన్వేషిస్తే - వైశాఖ శుద్ధ దశమి అన్ని విధాలా అనుకూలంగా వున్నదని తేలింది.

ఊరు - ఊరంతా పర్వదినంలా జరుపుకో దగిన శుభ సమయం అది. మామూలుగా ఓ స్థభాన్ని, గోతిలో పాతేయడం కాదు గదా!

శాస్త్రవిధి అని ఒకటుంది. దాని ప్రకారం వేద విహితంగా, కొంత క్రతువు జరిపి, నిర్దుష్టమైన కొలతలు గలిగిన గోతిని త్రవ్వి - అందులో నానా విధ వస్తు సామగ్రినీ ఆవాహన చేసి, నవరత్నాల వంటి విలువైన వాటిని పునాదిగా పరిచి, ఒక దివ్య లగ్నాన స్థంభ ప్రతిష్టాపన చేయాలి. అనంతరం సమారాధన. రాత్రి తెల్లార్లూ జాగరణ, వివిధ నృత్త - గీత - వాద్యాది సాంస్కృతిక కార్యక్రమాలూ జరిగించాలి.

మరి దీని కంతటికీ ద్రవ్యం కావాలి గదా!

పెద్దలు సమావేశమయ్యారు. యాగదీక్షకు వచ్చే దూరప్రాంతాల వేద విదులకు విడిది ఏర్పాట్లనుంచి, కార్యక్రమాంతాన ఎరువు తెచ్చినవి కడిగిచ్చే పనివాళ్ళ కూలి దాకా ఎంత ఖర్చవుతుందో అంచనావేశారు. అది పదివేలకు పైగా లెక్క తేలేసరికి, అందరూ కళ్ళు తేలవేశారు.

తమవల్ల కాదంటే, తమ వల్ల కాదని అందరు చేతులెత్తేశారు.

స్థంభ నిర్మాణానికే ప్రజానీకం దగ్గర చందాలు పోగుచేశాం. మూడు నెలల తేడాలో మళ్ళీ చందాల కోసం ఊరిమీద పడితే, వాళ్ళెక్కడి నుండి తెస్తారు. అని ఆ అభిప్రాయానికే స్వస్తి చెప్పేశారు.

అయితే మరెవరు పెట్టుకోవాలి ఈ ఖర్చు?

నువ్వు అంటే నువ్వు అనుకున్నారు.

"అక్రమంగా వెనకేసిందాంట్లో, అరవయ్యోవంతు అయినా బయటికి తియ్యరాదా! దేవుడి కార్యం కదా! ఏ ఖర్చు గట్టెక్కినా గట్టెక్కినట్లేగా" అని ఒకరి గుట్టు మరొకరు లాగడానికి ప్రయత్నించారు.

"ఆయనకు సలహా చెప్పకపోతే, ఆ పనేదో నువ్వే చెయ్యరాదా?" అని మరొకరు ఎత్తి పొడిచారు.

వాగ్వాదాల మధ్య సమస్య నలిగిపోయింది.

పెద్ద మనుషులు లేచి వెళ్ళిపోయారు.

ఆ వూరిలో, ముఖ్యంగా - ఒకనాడు స్వామికార్యానికి ఏ చేతులైతే కలసికట్టుగా సహకరించేయో, ఆ చేతులే కలియబడి కొట్టుకోడానికి సిద్ధమయ్యాయి.

తాను చెక్కిన ధ్వజస్తంభాన్ని - ప్రతిష్టించిన తర్వాత దాని ఠీవిని కళ్ళారా చూద్దామని కాసుక్కూర్చున వీరభద్రాచారి ఆశ అడియాసే అయింది.

తానొకటి తలిస్తే, పరమేశ్వరుడు ఇంకోలా తలచాడని వీరభద్రాచార్యులు వాపోయేడు.

వారం రోజుల అనంతరం పునః ప్రయత్నం చేసి. చీలిపోయిన పెద్ద మనుషులందర్నీ పేరు పేరునా బ్రతిమాలి చిదంబర శాస్త్రి మళ్ళీ సమావేశ పరిచాడు.


ఏం లాభం? సమస్య తెగలేదు. ఇంకోసారి దులిపేసుకుని వెళ్ళిపోయేరు.

జ్యేష్ఠ మాసం కూడా వచ్చి వెళ్ళిపోయింది.

చండ్ర నిప్పులు చెరిగే సూర్య భగవానుడి కన్నా తీక్షణంగా చూపులు రువ్వుకుంటున్నారు - ఊళ్ళో పెద్ద తలకాయలు.

స్వంత ఊసు ఎత్తేరన్న కక్షతో మనసులో కుతకుత ఉడికిపోతున్నారు.

ఆషాఢ మాసం - శూన్యమాసం - శుభకార్య నిర్వహణకి ఎలాగూ పనికి రాదు. ఈ లోగా కాలమే కొంతవరకు వాళ్ళని చల్లారుస్తుంది లెమ్మని చిదంబర శాస్త్రులూ ఊరుకున్నాడు.



# ప్రకృతి

## శ్రీ చిట్టిగుంట సాయి బాబా

కెందామర మూతి ముడిచిందని
తపనుడు తపించి అరుణుడైనాడు
ఆ తపనుని కిరణాల అరుణిమను
కుంకుమ పూ బాలలు అరువు తీసుకున్నాయి
శిలీముఖ సమాన కిరణ స్పర్శకు
కాలమేఘ మాలికలు ఖండ ఖండాలై
అవంతా కాశంలో అల్లల్లాడాయి
ఇంతలో —
తొలికిరణం తాకిడికి తామర
మెలమెల్లన ముచ్చటగా విచ్చుకుంటే
అది చూచిన కొంటె సూరీడు
'అమ్మయ్యా' అనుకుంటూ తెల్లనవ్వు నవ్వేడు!
అపుడపుడే హిమ జలకాలాడిన
ధరణీ రమణి
సూరీని నవ్వు టద్దాలలో చూచుకొంటూ
సస్యస్యామలాంబ రాన్ని సవరించు కొందోమారు
కలకూజితాల ఎలకోయిల
పెంటికి కంటితో కైపు సైగలు చేస్తూ
జగతి ఎరుగని జగన్మోహన రాగాన్ని
ఆరాధనాలాపనం చేస్తే,
భ్రమపడి కేకి క్రేం కారం చేసి
బర్హ సౌందర్య ప్రదర్శనంతో బర్హిణనివింపు కొంది,
విరహంలో ఊగిన ఆ నెమలి నెలత
శృంగార నర్తనం చేసి, అల సింది,
రెల్లు పొదలు వింజామర లైనాయి,
చిరుజల్లులు సైత్యోప చారాలు చేశాయి
ఆకాశానికి ఎదు రెదిగిన వెదురు
మోహన వంశిగా మారి గానం చేసింది.
ఆ పిల్లన గ్రోవి వల్లమాలిన విరహరాగానికి
క్షణం స్తంభించిన నెమలి నెలత
కాలు జారి, మోజు దీరి నెల తప్పింది.
చకోరాలు చేశాయి సీమంతపు మంతనాలు
సూడిద లైనాయి సుకకుసుమ పరాగాలు
ప్రకృతి ఆనందాబ్ధిలో తేలింది

ఆ వేసవుల్లోనే ప్రతిష్ఠ అయిపోతుందని, ఆ భాగ్యాన్ని కళ్ళారా దర్శించి తరిద్దామని కాటికి కాళ్ళు జాపుకున్న ముసిలాళ్ళు సైతం ఒకరిద్దరు – కోరిక తీరకుండానే తనువులు చాలించేసేరు.

ఈ లోగా – శ్రావణమేఘాల సందడితో, తొలకరి పులకరించింది. సర్వ జనావళికి హర్షసూచకంగా, వేసవి తాపానికి ఉపశమనంగా వర్షపు జల్లులు పడ్డాయి.

కాని – ఆ జల్లుల తేమ వాతావరణానికైనా, పెద్ద మనుషుల మనసులు చల్లబడ లేదు.

చిదంబర శాస్త్రికి పరిస్థితులే వేదన కలిగించాయి.

ఏం చేస్తే వాళ్ళ మనసులు కరుగుతాయా అని తీవ్రంగా ఆలోచించాడు.

అంతా అయిపోయి, ఆఖరు నిముషంలో కేవలం సంకుచిత మనస్తత్వాల వల్ల స్వామి కార్యానికి అంతరాయం కలగడాన్ని ఆయన భరించ లేక పోయేడు.

అంతే ! కఠోరమైన నిర్ణయం తీసుకున్నాడు.

వ్యక్తిగత దూషణలు మానుకుని, చిత్తశుద్ధితో తలో చెయ్యీ వేసి, విరూపాక్షుని ప్రాంగణంలో, ధ్వజస్తంభ ప్రతిష్ఠ దిగ్విజయంగా నిర్వహించకపోతే, ఆమరణ నిరాహార దీక్ష పాటిస్తానని ప్రతినబూనాడు – చిదంబరశాస్త్రి.

వీరభద్రాచార్యులను ఈ నిర్ణయం కదిలించి వేసింది. అతడి కళ్ళు చెమర్చాయి. శాస్త్రులు వారికి మద్దతుగా, తాను కూడా ఏదో ఒకటి చెయ్యాలని పించింది. నిరాహార దీక్షలో తానూ కూర్చుంటానన్నాడు అతడు. వద్దని వారించాడు చిదంబర శాస్త్రులు.

వార్త ఊరంతా ప్రాకింది.

పెద్దమనుషుల మనసులు కరగలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. దీక్షలోవున్న శాస్త్రులవారి శరీరము శుష్కించి పోతూన్నది.

కుంభవృష్టి కురిసే నడి వర్షాకాలం వచ్చింది.

చిత్రం ! ఆ యేడాది ఒక్క చినుకు లేదా వూళ్లో.

అయినా, జీవనది ప్రవహిస్తోంది కాబట్టి – ప్రజకీ పైర్లకి నీటి ఎద్దడి అంటే ఏమిటో తెలీలేదు.

దేవుడ్ని – దేవుడిలాంటి మనిషిని అగౌరవ పరచడమే దీనికి కారణమని వృద్ధులు సెలవిచ్చారు.

దీక్షలో కూర్చుని నెలరోజులు దాటిన తర్వాత ...

ఒకనాటి శుభోదయాన – అందరూ ఆశ్చర్యపోయే విధంగా, అతి చక్కగా – శివాలయానికి ఎదురుగా, నిర్ణీతమైన స్థలంలోనే ధ్వజస్తంభం ప్రతిష్ఠించ బడి వుంది.

"ఈ కలికాలంలో కూడా దేవతలు మహిమలు చూపిస్తున్నారా ...?"

"లే పోతే, ఏమిటది ? ... కనీసం ముగ్గురైనా సాయం పట్టనిదే, సామాన్యులు ఎత్తడానికి శక్యంగాని ధ్వజస్తంభాన్ని ఎవరు – ఎలా ప్రతిష్ఠించ గలుగుతారు ? ఇది తప్పకుండా దైవ ఘటనే కాని, వేరేం కాదు ..." అనీ —

"దేవతల చేత సైతం కంటతడి పెట్టించి ప్రతిష్ఠ జరిపించిన చిదంబర శాస్త్రులు కూడా, దేవుడు తప్ప సామాన్యుడు కాదనీ" ప్రజలు వేనోళ్ళ పొగడసాగారు.

నీరసంతో గత అర్ధరాత్రి సొమ్మసిల్లి పడిపోయిన చిదంబర శాస్త్రుల వారికి, స్పృహ తెప్పించి, ప్రతిష్ఠ జరిగిన ధ్వజస్తంభాన్ని చూపించి, దీక్ష విరమించవలసిందిగా కోరారు గ్రామ ప్రజలూ – పెద్దలూ.

పురజనుల కోరిక మేరకు, ఆ వృద్ధ బ్రాహ్మడు ఫలహారం స్వీకరించాడు.

తమ అల్పత్వానికి సిగ్గిల్లిన పెద్ద మనుషులు, చిదంబర శాస్త్రులను క్షమాపణ కోరుకుంటూండగా, ధ్వజస్తంభం చాటున చెమ్మగిల్లిన కళ్ళు వొత్తుకుంటూ నిలబడ్డాడు – వీరభద్రాచార్యులు.

అవును మరి ! అతడేకదా – ఈ ప్రతిష్ఠకి సూత్రధారుడు !